క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అమృత థియేటర్, ఏనుగుల గడ్డ, సుధానగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు, బొక్కలగడ్డ, పోచమ్మకుంట, కమ్మరివాడ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, అలంకార్ సర్కిల్, సిక్కువాడ ప్రాంతాల్లో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఎల్లంబజార్, మట్వాడ, విశ్వకర్మ వీధి ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి 11.30గంటల వరకు, రంగశాయిపేట, ఉర్సు, ఖమ్మం రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

7న డ్రాయింగ్ పోటీలు

హన్మకొండ చౌరస్తా: సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'సేవ్ గర్ల్ చైల్డ్' అనే అంశంపై ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు పాల్గొని సందేశాత్మక చిత్రాలను గీయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పోలీసుల ఔదార్యం



రామన్నపేట: నగరంలోని సంతోషిమాత గుడి సమీపంలో అండర్ బ్రిడ్జి మార్గంలో ఓగుర్తు తెలియని మహిళ బట్టలు లేకుండా పడిఉందని 100 నంబర్‌కు సమాచారం అందగా, డ్యూటీలో ఉన్న మట్టెవాడ పోలీస్ సిబ్బంది టి.కల్యాణ్‌కుమార్, పి.రవి.. సంఘటన స్థలానికి చేరుకుని డీఆర్ఎఫ్, మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో ఆ మహిళకు స్నానం చేయించి కొత్త బట్టలు కట్టించి, 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. పోలీసులు స్పందించిన తీరుపై స్థానికులు అభినందించారు.

'అక్రమంగా అనుమతిచ్చారు'

వరంగల్ అర్బన్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని ప్రైవేట్ స్కూల్‌కు సమీపంలో పది ఫీట్ల నాలా, బఫర్ నిబంధనలను పాటించకుండా జీ ప్లస్1 భవన నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు జారీ చేశారని స్థానికులు తెలిపారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవికి బుధవారం ఫిర్యాదు చేశారు. పలు కాలనీల మీదుగా వెళ్లే నాలాపై స్లాబ్ వేశారని పేర్కొన్నారు. సదరు భవనాన్ని, నాలాను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టాలు ఇచ్చేందుకు కృషి



కాజీపేట: ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న నిలువనీడ లేని నిరుపేదలకు ఇంటి నివేశన పట్టాలు ఇప్పించడానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. 25ఏళ్లుగా నివాసముంటున్న స్థలాల్లో తమకు పట్టాలు ఇప్పించాలని కాజీపేట పట్టణంలోని 63వ డివిజన్ ఏఆర్ఆర్ నగర్ కాలనీకి చెందిన పేదలు.. ఎమ్మెల్యేను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వాసం కోల్పోయిన బీజేపీ

హన్మకొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దేశంలోని ప్రజల విశ్వసనీయత కోల్పోయిందని ఏఐసీసీ ఓబీసీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ ఉల్లెంగల యాదగిరి విమర్శించారు. 400 సీట్లలో గెలుస్తామని నరేంద్ర మోదీ బీరాలు పలకగా, 230 సీట్లకే బీజేపీని ప్రజలు కట్టడి చేశారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలపై అభిమానం ఉంటే పార్టీ లెజిస్లేచర్ నాయకుడిగా బీసీ ఎమ్మెల్యేను ఎందుకు నియమించలేదని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు పదేళ్ల కాలంలో బీసీ బిల్లు ఎందుకు పెట్టలేదని పేర్కొన్నారు.

బల్దియాలో అంతర్గత బదిలీలు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్‌లో ఇద్దరు ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం ఆదేశాలు జారీ చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వినయ్‌ను కమిషనర్ సీసీగా బదిలీ చేశారు. కమిషనర్ సీసీగా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ అనిల్‌ను టౌన్‌ప్లానింగ్‌కు స్థానం చలనం కల్పించారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

మడికొండ: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మడికొండ స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ సూచించారు. ఈమేరకు మడికొండలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని పేర్కొన్నారు. అలాగే, మత్తు పదార్థాలు, గుట్కా, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కినట్లు గ్రహిస్తే వెంటనే 1930, ఆపద సమయంలో 100 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మడికొండ: అవగాహన కల్పిస్తున్న సీఐ ప్రతాప్



రామన్నపేట: మాట్లాడుతున్న ఎస్సై వెంకన్న

అప్రమత్తత అవసరం

రామన్నపేట: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఇంతేజార్‌గంజ్ ఎస్సై వెంకన్న సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా కొత్త నేర చట్టాలు, సైబర్ నేరాలపై నగరంలోని పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల వచ్చే కాల్స్, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని చెప్పే ఫ్రాడ్ కాల్స్, పార్ట్‌టైం జాబ్ అని పంపే మోసపూరిత లింకులు, ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని పంపే మెజేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. అలాగే, యువత డ్రగ్స్‌కు అలవాటుపడి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. ఎస్సై దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

హన్మకొండ కల్చరల్: తెలంగాణ సాయుధ పోరాటంలో, తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్న బంజారా జాతి వీరుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు కోరారు. హనుమకొండలోని హరిత కాకతీయలో బంజారా ఉద్యోగ సంఘం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాల వీసీల నియామకాల్లో బంజారాలకు అవకాశం కల్పించాలని, ప్రైవేట్, ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్, పదోన్నతులు, నామినేటెడ్, బ్యాక్‌లాగ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగ సంఘం నాయకులు పోరిక నంద నాయక్, ఈశ్వర్‌సింగ్ నాయక్, ఉదయ్‌సింగ్ నాయక్, అర్పిత నాయక్, ఆచార్య సమ్మూలాల్ నాయక్, నవీన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూక్య బాబురావు

పారిశుద్ధ్య పనులు



కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ మెయిన్ రోడ్డులో అక్షర స్కూల్ నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని కల్వర్టు వరకు పారిశుద్ధ్య పనులను మున్సిపల్ సిబ్బంది బుధవారం చేపట్టారు. ఈమేరకు మురుగునీటి కాలువలను జేసీబీ సహాయంతో శుభ్రం చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, నరేష్, మున్సిపల్ సిబ్బంది కుమార్, జవాన్ వెంకటస్వామి, చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకుడు సందెల విజయ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ వారియర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల పీఏసీఎస్ సొసైటీ ఉపాధ్యక్షురాలు సోల్తి భూమాత, డాక్టర్ ఆకారపు రాజగోపాల్, డివిజన్ యూత్ అధ్యక్షుడు సోల్తి నరేందర్, ఆర్పీ సరిత, పద్మ, శ్రీపాద రాము, రాజేష్, హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మచ్చిక రాజు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సదస్సు



సభకు రావాలని ప్రచారం చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఖమ్మం జిల్లా కేంద్రంలో గురువారం జరగనున్న దొడ్డి కొమురయ్య 78 వర్ధంతి సదస్సు జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ ప్రజా సంఘాల నాయకులు బండి కోటేశ్వరరావు, గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు సూచించారు. కొమురయ్య వర్ధంతి సభకు తరలిరావాలని వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెట్రోల్ బంక్ జంక్షన్‌లో సీపీఐ న్యూడెమోక్రసీ నేత రాచర్ల బాల రాజు ఆధ్వర్యంలో బుధవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య తొలి అమరుడిగా నిలిచాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో రంజిత్, బన్న నర్సింగం, బండి కుమార్, సాంబయ్య, ఇనుముల కృష్ణ, ఎండీ.అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాశిబుగ్గ: ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని 100 ఫీట్ల రోడ్డు హోసన్నా చర్చి ఎదురుగా ఉన్న సిమెంట్ పైపులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఏనుమాముల ఎస్సై పోగుల శ్రీకాంత్ తెలిపారు. సుమారు 48 ఏళ్ల వయస్సు గల వ్యక్తి ఆకుపచ్చ టీషర్టు, నల్లని ప్యాంట్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. బల్దియా జవాన్ రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు. వివరాలకు ఏనుమాముల పోలీస్ స్టేషన్‌లో లేదా, 87126 85120, 87126 85081 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. భర్త బోడ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

విశ్వకర్మలకు స్థలం కేటాయించండి

హన్మకొండ చౌరస్తా: వృత్తినే నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న విశ్వకర్మలకు రాంపూర్‌లోని పారిశ్రామిక వాడలో 20 ఎకరాల స్థలం కేటాయించాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు క్రిష్టాజీ రవీంద్రచారి కోరారు. ఈమేరకు పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ అజ్మీర స్వామిని హనుమకొండలోని కార్యాలయంలో బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ అనేక మంది వడ్రంగి, కమ్మరి వృత్తులను నమ్ముకుని అద్దె షెడ్లలో కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెలిశోజు బుచ్చిరాములు, కేశోజు వెంకట్, రేవోజు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాధ్యులు

'రామకృష్ణ'కు సముచిత స్థానం కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: నిరుపేదలకు ఉచిత వైద్య సేవలందిస్తూ, కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు రాజ్యసభ లేదా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ప్రజా సంఘాల బాధ్యులు కోరారు. ఈవిషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ మాట్లాడుతూ పెరుమాండ్ల రామకృష్ణ నిస్వార్థపరులకు పదవులు ఇస్తే ప్రజలకు మరింత సేవలందిస్తారని వివరించారు. కార్యక్రమంలో మాదాసి సుదర్శన్, మోరె ఐలయ్య, మాట్ల మురళి, మాదాసి నవీన్, దార ప్రమీల, దార పవన్ కళ్యాణ్ ఉన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి: గురువారం విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పలు విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు కోరారు. హనుమకొండలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, యూఎస్ఎఫ్ఐ, ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయా సంఘాల ఉమ్మడి వరంగల్, హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యులు భాషబోయిన సంతోష్, నర్సింహారావు, మంద శ్రీకాంత్, రంజిత్, పల్లకొండ సతీష్, మాలోతు రాజేష్ మాట్లాడారు. సమావేశంలో ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు స్టాలిన్, ప్రణీత్ గౌడ్, రవితేజ, వినయ్, వేల్పుల చరణ్, కుమార్, మహేష్, రమేష్, ముషారఫ్, రాకేష్ పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా: విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున కోరారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ(యూ) ఓంకార్ భవన్‌లో విద్యాసంస్థల బంద్ వాల్‌పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం గ్రేటర్ వరంగల్ నాయకులు పోలబోయిన రాజు, శ్రీజిత్, దినేష్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఖిలా వరంగల్: గురువారం దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల జిల్లా ప్రతినిధులు ల్యాదల్ల శరత్, ఆలువాల నరేష్, శ్రావణ్, ఉదయ్ అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. సమావేశంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాటం శివకుమార్, ప్రభాస్, అభిరామ్, సోను, రమేష్, భరత్, తరుణ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలకు ఏర్పాట్లు

ఖిలా వరంగల్: ఈనెల 8న ప్రారంభం కానున్న మొహర్రం వేడుకలను తగిన ఏర్పాట్లు చేస్తామని స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, బీఆర్ఎస్ నాయకుడు బోగి సురేష్, ముజావరీ సయ్యద్ యాకూబ్ (అషూ) హామీ ఇచ్చారు. ఈమేరకు వరంగల్ మధ్యకోటలోని పీరీల చావడీలను ముస్లిం మత పెద్దలతో కలిసి వారు బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మోహిజ్, రబ్బానీ, ఇబ్రహీం, శౌకత్, యాకూబ్, మహిమూద్, సోఫీ, సయ్యద్ ఇబ్రహీం, గౌస్, ఇర్షాన్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



చావడీలను పరిశీలిస్తున్న ముస్లిం మతపెద్దలు

బురద రోడ్డుపై రైతుల నిరసన

మామునూరు: ఇటుక బట్టీల నిర్వాహకుల తీరుతో వ్యవసాయం చేయలేకపోతున్నామని రైతులు ఆందోళనకు దిగారు. ఈమేరకు రోడ్డుపై జేసీబీని అడ్డంగా పెట్టి బుధవారం నిరసన తెలిపారు. ఇటుక బట్టీల కారణంగా ఖిలా వరంగల్ మండలం నక్కలపెల్లి గ్రామంలో పంట పొలాలకు వెళ్లే ప్రధాన రోడ్డు వర్షానికి బురదమయమైంది. ఇటుక లోడుల ట్రాక్టర్లు, లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా మారిందని రైతులు తెలిపారు. ఈ విషయమై అడిగితే బట్టీల నిర్వాహకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న మామునూరు పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో వారు ఆందోళనను విరమించారు.



నిరసన తెలుపుతున్న రైతులు

అడిషనల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు



కృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

వరంగల్ అర్బన్: బల్దియా ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్‌గా, సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డిని బల్దియా ఉద్యోగులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు బాకం సంతోష్ కుమార్, రావుల ఆనంద్ కుమార్, ఉమా దేవేందర్, హబీబ్ పాషా, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రామకృష్ణ, బండారు రవికుమార్, అయిత సుఖధ, చీకటి గిరిబాబు, సునీల్, సందీప్, అనిల్ కుమార్, సూర్య నారాయణ, అన్వర్ పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్

నగర మేయర్ గుండు సుధారాణిని బల్దియా ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్, సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.

విద్యుత్ మీటర్ల మంజూరుపై హర్షం

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఎల్బీఆర్ కాలనీలో 230 ఇళ్లకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ మాట్లాడుతూ గత ఏళ్లుగా కరెంటు మీటర్లు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకులు గూడ శారద రమ్య, కాలనీ అధ్యక్షుడు దొడు నాగరాజ్, కమిటీ సభ్యులు శ్యామల, ఎలకొండ శ్రీనివాస్, వాడపల్లి రవి, ఎండీ.హుస్సేన్, ఓరుగంటి రేణుక పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

ఆలయ వివాదంలో నోటీసులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలోని జలేశ్వరాలయ శివాలయ భూవివాదంలో పలువురికి హైకోర్టు నోటీసులు జారీ చేసిందని ఆలయ కమిటీ బాధ్యులు చీకటి రాజు, మట్టా శ్రీనివాసరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ పరిధిలోని సర్వే నంబర్ 1103లోని భూమిని సీతారామయ్య, వర్షిణి కబ్జా చేయడానికి యత్నించగా హైకోర్టును ఆలయ పరిరక్షణ కమిటీ ఆశ్రయించినట్లు తెలిపారు. ఆలయ స్థలం వివాదంలో అధికారులకు అనేకసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి వాదనలు వినిపించినట్లు పేర్కొన్నారు. కేసును పరిశీలించిన హైకోర్టు.. సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసిందని రాజు, శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కృషీవలుడు మోహన్‌రావు



మోహన్‌రావును సన్మానిస్తున్న సీఎండీ

హన్మకొండ: సమస్యను సమర్థవంతంగా పరిష్కరించే కృషీవలుడు సీజీఎం (రిటైర్డ్) వి.మోహన్ రావు అని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి కొనియాడారు. హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్, సీజీఎం వి.మోహన్‌రావు పదవి విరమణ ఆత్మీయ మహోత్సవం మంగళవారం రాత్రి జరిగింది. సీఎండీ వరుణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మోహన్‌రావు సంస్థ పురోభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని, ఆయన భావిజీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు, ఎస్ఈలు, డీఈలు, పర్సనల్ అధికారులు, అకౌంట్స్ ఆఫీసర్లు, అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, అసోసియన్ల నాయకులు మోహన్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు రాజుచౌహాన్, కేఎస్.గుట్ట, రవీంద్రనాథ్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పొలం బాగుంటేనే మేలైన సేద్యం

- కష్టపడే రైతన్న చూడాల్సింది పొలాన్ని
- యాజమాన్య పద్ధతులతో సరిచేసుకుంటే మేలు
- మెరుగైన దిగుబడికి అదొక్కటే సరైన మందు



చెలక దున్నుతున్న రైతు

కాజీపేట: ఆరుగాలం శ్రమించే రైతన్నకు దక్కే ప్రతిఫలం తక్కువైతే ఇక ఆ కష్టం వృథాయే. పెట్టిన పెట్టుబడి సైతం కోల్పోయి అప్పులే మిగులుతాయి. ప్రధానంగా వ్యవసాయానికి ఎంచుకున్న పొలాన్ని సక్రమంగా తీర్చిదిద్దుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నది నిపుణుల అభిప్రాయం. ముఖ్యంగా పొలాలు బాగున్నప్పుడే దిగుబడి అధికంగా ఉంటుందని కాజీపేట మండల వ్యవసాయ అధికారి దొండపాటి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సమస్యాత్మక భూములను చిన్నపాటి యాజమాన్య పద్ధతులు పాటించి సరిచేసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన పలు సూచనలు చేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

వాలు భూములు

భూములు వాలుగా ఉంటే నేలకోత ఎక్కువగా ఉంటుంది. వర్షాలు కురిసిన సమయంలో భూసారం కొట్టుకుపోతోంది. నీటి నిల్వ తేమ శాతం తగ్గిపోవడం వల్ల పంటలు త్వరగా బెట్టగా మారేందుకు అవకాశం ఉంటుంది. దాంతో పంట దిగుబడులు తగ్గే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి భూముల్లో దుక్కులు చేసుకోవాలి. పంటలు సాగుచేసిన మూడు వారాల తర్వాత పెద్దనాగలితో ప్రతీ మూడున్నర మీటర్లకు ఒక చోట వర్షపు నీటి సంరక్షణ కోసం గొడ్డుసాలు దున్నాలి. వాలు తీవ్రత అధికంగా ఉన్నప్పుడు కాంటూరు గట్లను నిర్మించాల్సి ఉంటుంది. ఈ గట్టు వర్షపు నీటి వేగాన్ని ఆపి నేలలో నీటి నిల్వను పెంచుతాయి.

లోతు తక్కువగా ఉన్న నేలలు

లోతు తక్కువగా ఉన్న భూముల్లో వేసిన పంట మొక్కల వేర్లు పెరుగుదల తగ్గి నీరు భూసారం పరిమితంగా ఉండడంతో పంట దిగుబడి తగ్గిపోతుంది. ఈ సమస్యను అధిగమించడంలో భాగంగా వాలుకు అడ్డంగా బోదెలు, కాల్వలు నిర్మించి పైరును బోదెల మీద నాటాలి. ఒక మీటరు దూరంలో కనీసం మూడేళ్లకు ఒకసారి లోతుగా దున్నాలి. పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువులు ఎక్కువగా వేయాలి.

నీటి నిల్వ ఉండని భూములు

ఇలాంటి భూముల్లో ఇసుక శాతం అధికంగా బంకమన్ను శాతం 20 కన్నా తక్కువగా ఉంటుంది. దీని కోసం ఎకరాకు మూడు టన్నుల చవుడు స్వభావం లేని చెరువు మట్టిని వేసవిలో వర్షాలకు ముందే తోలాలి. చెరువు మట్టి పొలంలో కలవడం వల్ల బంకమన్ను శాతం పెరిగి భూమికి నీటిని, పోషక పదార్థాలను నిలుపుకునే శక్తి పెరుగుతుంది.

పైన గట్టి పొర

ఇలాంటి భూముల్లో పైన గట్టి పొర ఉంటుంది. కాని కింద మామూలు మట్టి ఉంటుంది. దీని కోసం పెద్ద ట్రాక్టర్‌తో లోతుగా దున్నే ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుకుంటే సరిపోతుంది. గడ్డిని పూర్తిస్థాయిలో తొలగించాలి.

మాగాణిలో దుక్కి సమస్య

వరి కోతల తర్వాత అందులో ఆరుతడి పంటలు వేయడానికి భూమిని దున్నగానే పెళ్లలు పెద్దవిగా లేస్తాయి. అందువల్ల వేసిన పైరు సరిగా మొలకెత్తదు. దీనికోసం భూముల్లో మొదట మామూలుగా నాగలితో దున్ని ఆతర్వాత రోటోవేటర్ లేదా పళ్ల దంతితో దున్నితే పెద్ద పెళ్లలు పగిలి ఆరుతడి పంటల సాగుకు ఇబ్బంది ఉండదు.

ఒలింపియాడ్‌లో అనికేత్‌కు గోల్డ్‌మెడల్

కాజీపేట రూరల్: ఒలింపియాడ్‌లో కాజీపేట ఫాతిమానగర్‌లోని బిషప్ బెరెట్టా హైస్కూల్ విద్యార్థి రాచర్ల అనికేత్‌కు గోల్డ్ మెడల్ లభించింది. సిల్వర్ జోన్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో 2023 -24వ సంవత్సరానికి నిర్వహించిన పరీక్షలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి అనికేత్ ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు జయప్రతాప్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలో 219, సౌత్ జోన్ స్థాయిలో 6,984 ర్యాంక్ సాధించినట్లు వివరించారు. ఈ మేరకు పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అనికేత్‌కు గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేసి హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.



అనికేత్‌కు గోల్డ్‌మెడల్ ప్రదానం చేస్తున్న హెచ్ఎం